కథ

# జీవిత మకరందం

పెనుమాక నాగేశ్వరరావు

''మీరు ఎన్నన్నా చెప్పండి, నేను అతన్నే చేసుకుంటాను'' ధైర్యంగా అన్నది ఇందిర.

''మేం చెప్తున్నది నీకు తలకి ఎక్కుతున్నదా లేదా'' కోపంగా అడిగాడు నారాయణరావు.

''అన్నీ అర్థమయ్యే మాట్లాడుతున్నాను'' తండ్రి ప్రశ్నకు ఏ మాత్రం తడబడకుండా సమాధానం చెప్పింది ఇందిర.

''వీల్లేదు, చూస్తూ చూస్తూ మేం ఈ పెళ్లి చేయలేం'' కటువుగా పలికింది తల్లిగొంతు

''మూడు గంటల క్రితం కూడా అబ్బాయి అందంగా వున్నాడంటూ మురిసిపోయావుకదమ్మా... ఇంతలోనే అంత వ్యతిరేకమా!'' అడిగింది ఇందిర.

''అన్నీ సవ్యంగా వుంటేనే అందమైనా, చందమైనా''

''అయితే!'' రెట్టించింది ఇందిర

''ఇక మాటలు అనవసరం ఇందిరా. మేమందరం నీ మంచి కోరేవాళ్లమే. మా మాట విను. ఇదంతా నీ భవిష్యత్తుని, నీ పిల్లల భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని చెప్తున్నమాటలమ్మా'' అనునయంగా అన్నది తల్లి - వర్ధనమ్మ.

''ఎవరి భవిష్యత్తు ఎవరి చేతుల్లో వుందమ్మా... ఇవన్నీ అర్థం లేని ఆలోచన్లు. నాకా మాత్రం తెలియక పోలేదు. నా నిర్ణయంలో ఏ మాత్రం తొందరపాటు తనమూ లేదు. తెలివి తక్కువా లేదు. మీరు నిర్భయంగా వుండండి. నిండు మనసుతో ఆలోచించండి చాలు. అంతా సవ్యంగా, సజావుగా జరిగిపోతుంది'' భరోసాగా అన్నది ఇందిర. ''దీనికి పిచ్చెక్కింది. అది కుదిర్తేగాని పెళ్లి కుదరదు. మీ సంబంధం మాకు ఇష్టం లేదని వాళ్లకి ఫోను చేసి చెప్పండి ముందు'' దురుసుగా అన్నాడు చక్రపాణి.

''తొందరపడి మాట్లాడకండి'' భర్తనుద్దేశించి మందలింపుగా అన్నది చక్రపాణి భార్య.

''ఇందిరతో నేను మాట్లాడతాను. మీరంతా వెళ్లండి... ప్లీజ్'' ఇంటికి పెద్ద అల్లుడు శ్రీధర్ మాటకు కట్టుబడి ఎవరికి వారు అక్కడి నుంచి వెళ్లబోయేంతలో...

''సారీ బావా... ఇక ఈ విషయంగా నేను ఎవర్తోనూ ఏం మాట్లాడను. నా నిర్ణయం మారదు'' స్థిరంగా చెప్పింది ఇందిర.

''ఇంతమందిమి వద్దని నెత్తీనోరు బాదుకుంటుంటే నీకు ఏం దెయ్యం పూనిందే... ఇంత పట్టు పడు తున్నావ్'' ఆవేశంగా అన్నది వర్ధనమ్మ.

''వర్ధనీ... నువ్వు అరవకు'' భార్యను హెచ్చరించిన నారాయణరావు మవునంగా తన గది వైపుకు నడిచాడు.

'తెగేవరకు లాగటం మంచిది కాదు. ఈ విషయాన్ని మరింత లోతుగా ఆలోచించాల్సిన అవసరం వున్నది'' అనుకున్నాడు నారాయణరావు.

అందరు చెప్తున్నదీ సబబుగానే తోస్తున్నది, ఆ ఇంట్లో అందరికంటె చిన్నవాడయిన, ఇందిర తమ్ముడు మురళికి.

అయితే అక్క తెలివి తేటలపైనా, ఆమె ఆలోచనా విధానం పైనా అపారమైన నమ్మకం అతనికి. అందుచేతనే ఏదో బలమైన కారణం వుండబట్టీ ఆమె అలా పట్టుదలగా ఉందనిపించి తనేం మాట్లాడకుండా మిన్నకుండి పోయాడు మురళి.

ఆ ఇంట్లో అందరి మనసుల్లోనూ ఒకటే ఆలోచన మురళి ద్వారానే ఇందిర మనసు మార్చాలని నిర్ణయించుకున్నారు. అందుకు కారణం మురళి అంటే ఇందిరకు వల్లమాలిన ప్రేమ.

***

ఇరవై మూడు సంవత్సరాల ఇందిరకు సరిగ్గా ఇరవైరోజుల క్రితం ఆ ఇంట్లో పెళ్లి చూపులు జరిగినై. అదే మొదటి పెళ్లిచూపుల వేడుక ఆమెకు. కూతురి పెళ్లిచూపుల కార్యక్రమాన్ని భారీగా జరిపించాడు నారాయణరావు. స్వతహాగా ఆస్తిపరుడు కాకపోయినా ఆ చుట్టుప్రక్కల పేరు ప్రఖ్యాతులు సంపాదించిన న్యాయవాది.

ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. వచ్చేపోయే బంధుమిత్రుల్తో ఆ ఇల్లు ఎప్పుడూ నిత్య కల్యాణం, పచ్చతోరణంలా వుంటుంది. 'నలుగుర్తో పాటు నారాయణ'గా కాకుండా తనకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకున్న పెద్దమనిషి నారాయణరావు. ఆయనకు తగిన అర్ధాంగి వర్ధనమ్మ.

అమ్మ నాన్న అక్క వెంట రాగా పెళ్లిచూపులకు వచ్చిన వరుడు శ్రీనివాస్‌కు మొదటి చూపులోనే ఇందిర నచ్చేసింది. మనసులోనే ఆమె అందాన్ని మెచ్చేసుకున్నాడు. ఇందిర పరిస్థితి కూడా అదే. 'గ్రీకు వీరుడు నా రాకుమారుడు' అనుకుని మురిసిపోయింది. నిజానికి ఆ ఇద్దర్నీ చూసినా ఎవరైనా 'తగిన జంట' అనుకోవాల్సిందే. పైగా లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అనుకోదగిన అనుభవం ఇద్దర్లోనూ ఏర్పడింది.

''మీ ఇద్దరూ ఏమైనా మాట్లాడుకోవాలనుకుంటే అలా వెళ్లి మాట్లాడుకోవచ్చు'' అంటూ హాలుకు పక్కనే వున్న గదిని చూపిస్తూ అన్నాడు సంబంధం తీసుకువచ్చిన మధ్యవర్తి.

అందరి నవ్వుల మధ్యన ఆ ఇద్దరూ గది వైపుకు నడిచారు.

ఇరుపక్షాల వారికీ 'ఈ సంబంధం కుదిరితే బాగుండు' అనే భావం కలిగిన మాట నిజం.

తను డ్రా చేస్తున్న జీతం గురించి, గడపాలనుకుంటున్న జీవితం గురించీ, గడచిన జీవితం గురించీ ఉన్నది ఉన్నట్లు విశదపరిచాడు శ్రీనివాస్.

అతనలా విడమరచి, దాపరికం లేకుండా చెప్పిన విధానానికి అమిత సంతోషం కలిగింది ఇందిరకు. అంత కలివిడిగా మాట్లాడిన అతడినైజం ఆమెను ఎంతగానో ఆకట్టుకున్నది. అందుకే ఆమె కూడా తన మనసు పూర్తిగా బయట పెట్టేసింది. ఆమె కోరికల్ని, భావాల్ని ఊహల్నీ, ఇష్టాల్ని ఏ మాత్రం దాచుకోకుండా అతడికి చెప్పేసింది ఇందిర.

''నిజం చెప్పాలంటే మీరు మా కన్నా స్థితిమంతులు. నాకున్నది చేస్తున్న ఉద్యోగమే. అదే నా ఆస్థి. ఆర్థిక పరిస్థితులన్నీ కూడా మీకు నచ్చి సర్దుకు పోగలననుకుంటే...''

''అవన్నీ వాకబుచేశాకే మా నాన్నగారు మీకు కబురు చేశారు. అయినా నేనిప్పుడు వాటిని గురించి ఆలోచించడం లేదు...'' నర్మగర్భంగా అన్నది ఇందిర.

''ఊc... అయితే... నాకేం అలవాట్లు లేవు. వక్కపొడి, సిగరెట్, డ్రింక్... వగైరాలేం అక్కర్లేదు... సరేనా'' సూటిగా చెప్పేసరికి కాస్తంత ఇబ్బందిప

డినా, లోలోపల అంతకు రెండింతలు సంతోష పడిపోయింది. ఆమె సంతోషానికి కారణాలు రెండు. ఒకటి అతనికి ఏ అలవాట్లు లేక పోవడం, రెండోది తన మనసులో మాట గుర్తించి అడక్కుండానే అలవాట్ల గురించి చెప్పటం.

అంతటితో ఆగని శ్రీనివాస్ మళ్లీ మళ్లీ అడిగి ఇందిర ఇష్టాల్ని, అయిష్టాల్ని చెప్పించుకున్నాడు. ఇద్దరూ మాట్లాడుకోవడం పూర్తయిందనుకున్న తర్వాత బయటకు వచ్చారు.

పెళ్లిచూపులు జరిగిన రెండవ రోజునే అబ్బాయికి, అమ్మాయికి ఒకరికి ఒకరు నచ్చినట్లు కబురు చేసుకున్నారు. ఇరువైపుల పెద్దలకూ సంబంధం ఆమోదమైంది. అందరికీ సంతోషం కలిగింది. అతి త్వరలోనే నిశ్చయతాంబూలాలు తీసుకుని వీలయినంత త్వరలో పెళ్లికి కూడా ముహూర్తాలు నిర్ణయించుకోవాలనుకున్నారు.

ఇందిరకు, శ్రీనివాస్‌కు సెల్‌ఫోన్ సంభాషణలు ప్రారంభం అయినై. అరగంటకు ఒకసారి ఫోన్లు గోల చేయసాగినై. పెద్దలంతా ఆశ్చర్యంతో నవ్వుకుంటున్నారు. ఊరు వెళ్లబోయే ముందు శ్రీనివాస్ ఇందిర ఫొటో కావాలని అడిగేడు ఫోనులో. మురళిచేత పంపించింది ఇందిర. ఇంట్లో అందరి అనుమతితో తన ఫొటో కూడా మురళికి యిచ్చిపంపేడు శ్రీనివాస్. శ్రీనివాస్ ప్రయాణమైన రోజున తండ్రిని వెంట పెట్టుకుని రైల్వేస్టేషన్‌కి వెళ్లింది ఇందిర.

కావాలనే గంట ముందుగా స్టేషనుకు చేరుకున్నాడు. వారపత్రికతో ఓ చోట కాలక్షేపం చేస్తూ కూర్చున్నారు నారాయణరావు. ఎడతెగని ముచ్చట్లతో సమయమే తెలియటం లేదు కాబోయే జంటకు. అయిదు నిమిషాల్లోనే అరగంట గడిచి పోయినట్లనిపించింది ఇద్దరికీ.

అంతలోనే తాము ఎదురు చూస్తున్న రైలు మరో నలభై నిమిషాలు ఆలస్యంగా వస్తున్నట్లు విన బడిన ప్రకటన వీనుల విందుగా అనిపించింది ఇందిరకు, శ్రీనివాస్‌కు. ఎంతసేపు కబుర్లు చెప్పు కున్నా తరగటం లేదు. తనివీ తీరటం లేదు. సమయం చాలటం లేదు. ఎట్టకేలకు రైలు వచ్చింది. రైలు మళ్లీ కదిలేవరకు ఇందిర పక్కనే నిల్చుని ఏవేవో చెప్తూనే వున్నాడు శ్రీనివాస్. రైలు కదల బోతుండగా ఎక్కాడు. టాటాలు చెప్పుకుని దిగులుగా బెర్తు చేరుకున్నాడు శ్రీనివాస్, ఇల్లు చేరుకుంది ఇందిర.

***

కాబోయే శ్రీమతి ఫొటో సన్నిహితంగా వుండే సహోద్యోగులకు చూపించాడు. అందరూ ఆమెను మెచ్చుకుంటుంటే సంబరపడ్డాడు. అందరికీ పార్టీ ఇచ్చాడు. పగలూ రాత్రి, ఇందిర ధ్యాసతోనే గడిపేయసాగేడు శ్రీనివాస్. మొదటి పెగ్గులో మజా అన్నాడో కవిగానీ, మొదటి చూపులోనే ఇంత నిషానా అనుకోకుండా వుండలేక పోయాడు శ్రీనివాస్.

ఎప్పుడెప్పుడు అమ్మానాన్నల దగ్గర్నుంచి పిలుపు వస్తుందా ఎప్పుడెప్పుడు ఇందిర ముందు వాల్దామా, ఎప్పుడు లగ్నాలు కుదుర్తాయా అని ఆరాటపడిపోతున్న శ్రీనివాస్‌కు అశని పాతంలా అందింది పింక్ స్లిప్. అవాక్కయ్యాడు. ఊహించని పరిణామానికి ఉలిక్కి పడ్డాడు.

ఎందరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల మాదిరే శ్రీనివాస్‌కు కూడా ఉన్నపళంగా ఉద్యోగానికి ఉద్వాసన పలికారు. లక్షలమందిలో అతనొకడు. నిరుత్తరుడయ్యాడు. తీసుకున్న కారు లోను తీరేదెలా? ఇంటిలోను నెలనెలా కట్టేదెలా? కాబోయే పెళ్లి, రాబోయే భార్య, చేయాల్సిన కాపురం, మోయాల్సిన సంసారం... అమ్మో తలుచుకునేందుకు భయమేసింది. గజగజ వణికిపోయాడు. అన్నింటికీ మించి ఈ పరిణామానికి ఇందిర ఎలా ప్రతి స్పందిస్తుందో వూహించలేక పోయాడు.

ఇందిర కాదంటే?... అసలా ఆలోచనే భరించలేక పోయాడు. అయినా సరే ఆమె దగ్గర ఏదీ దాయటం ఇష్టం లేక పోయింది. వెంటనే విషయం తల్లిదండ్రులకు ఫోను చేసి చెప్పేడు. ఇదే విషయాన్ని ఇందిరకు, ఆమె తల్లితండ్రులకు కూడా తెలియచేయమన్నాడు. తన సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. వెంటనే ఏం చేయటానికి, ఏం చెప్పటానికి అతనికి పాలు పోలేదు. ఇందిరతో ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో అర్థం కాకనే ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు తాత్కాలికంగా. శ్రీనివాస్ తల్లితండ్రులు విషయాన్ని నారాయణరావుకు ఫోన్ చేసి చెప్పేరు.

అదిగో ఆ తర్వాత ఇందిర ఇంట్లో తర్జనభర్జనలు, వాదోపవాదాలు మొదలైనై.

ఉద్యోగం లేని వాడ్ని పెళ్లి చేసుకుని ఏం సుఖపడతావంటూ ఇంట్లో వాళ్లంతా తలా ఓ రకంగా మాట్లాడుతుంటే అందర్నీ కాదని అతన్నే చేసుకోవాలని ఆరాట పడుతున్నది ఇందిర.

అన్నింటికంటె ముఖ్యంగా నాలుగు రోజులుగా శ్రీనివాస్ దగ్గర్నుంచి ఫోను రాక పోవడం, తను చేసినా పలక్కపోవడం ఎక్కువగా కలవరపెట్టసాగింది ఆమెను. అవమాన భారంతోనో, అభద్రతా భావంతోనో ఏ అఘాయి



త్యమో చేసుకోరు కదా అని భయపడింది ఇందిర.

అతడికి ఉద్యోగం పోయిందని తెలిసిన రోజున తండ్రి తనను దగ్గర కూర్చోబెట్టుకుని.

‘‘అన్నింటికంటె సెక్యూరిటీ ముఖ్యం తల్లీ. అనిశ్చితమైన జీవితం చాలా కష్టం. కడుపు నిండితేనే ఏ కబుర్లైనా. ముందు కడుపు నింపే మార్గం. మళ్లా అతను ఏదో ఒక ఉద్యోగం వెతుక్కోవాలి. పోయి నంత సులభం కాదుగా



దొరకటం, అయినా మళ్లీ అంత మంచిది దొరకటం కష్టం. అసలు ఏదైనా మనం తొందరపడటం మంచిది కాదేమో.... మళ్లీ ఆలోచించుకోవాల్సిన అవసరం వుందమ్మా'' అని చెప్పిన మాటలు మనసులో మెదిలినై ఇందిరకు.

''అసలే ఆడపిల్లను ఇచ్చుకునేటప్పుడు అనేక రకాలుగా ఆలోచించుకోవాలి. పెళ్లి అనుకోగానే ఉద్యోగం పోయిందంటూ రేపు అయిన దానికీ కాని దానికీ నిన్ను నీ అదృష్టాన్ని తప్పులు పడితూ మాట్లాడితే మేం తట్టుకోలేమమ్మా. ఎందుకు వచ్చిన సంబంధం.. ఇదికాకపోతే ఇంకొకటి'' సెంటిమెంట్‌తో అమ్మ చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చినై.

'ఒక వేళ పెళ్లి అయిన తర్వాత అతనికి ఉద్యోగం పోయి వుంటే వీళ్లంతా ఏం చేసి వుండే వాళ్లు! ఏం మాట్లాడే వాళ్లు? ఎవరు వూహించగలరు? లక్షల మందిని ఉద్యోగాల నుండి తీసేస్తున్నారు. ఎవరి సమస్యలు వారివి. ఎవరికి ఎవరు జవాబుదారి? లక్షల మందిలో ఆయనా ఒకరు. అతన్నికాక మరొకతన్ని వెతుక్కున్నా అతగాడి పరిస్థితి మాత్రం గ్యారెంటీ ఏమిటి? అసలు ఆ లెక్కన ఎవరి ఉద్యోగానికిగాని, ఎవరి బ్రతుక్కు గాని, ఏ ఆస్తికి గాని, పదవికి గాని ఎక్కడున్నది సెక్యూరిటీ? ఎవరిస్తారు హామీ' పరిపరివిధాల ఆలోచించిన ఇందిర ఏది ఏమైనా శ్రీనివాస్‌నే పెళ్లి చేసు కోవాలని నిర్ణయించుకున్నది.

అందచందాల విషయం అటుంచి మనసు విప్పి మాట్లాడిన అతగాడి విధానం ఇందిరను అమితంగా ఆకట్టుకుంది. పైగా ఉద్యోగం పోయిందన్న విషయం తమకు తెలియచేయక పోయినా ఎవరూ ఏంచేసేదిలేదు. కానీ అతనలాంటివాడు. కాదు కాబట్టే నిజాన్ని నిర్భయంగా వెల్లడించాడు. అందుకే ఆమె అతని పట్ల అంతగా మక్కువ చూపిస్తున్నది.

ఇలా... ఇంట్లో వాళ్లంతా ఎవరి అంతర్మథనంలో వాళ్లు వుండగా ఇందిర సెల్ మోగింది. కాల్ శ్రీనివాస్ నుంచి కావడంతో ఆనందంలో ఉబ్బి తబ్బిబ్బై పోయింది ఇందిర. ఆత్రంగా అక్కడ చేరిన అందరి వంకా పరవశంగా చూసింది.

మామూలుగా అయితే శ్రీనివాస్ దగ్గర్నుంచి కాల్ వస్తే చాలు వడివడిగా తన గదిలోనో, అలా డాబాపైకో వెళ్లి మాట్లాడే ఇందిర ఈసారి మాత్రం కావాలనే అక్కడే అందరి ముందు మాట్లా డేందుకు నిర్ణయించుకుంది.

''నాలుగు రోజులుగా ఫోన్ చేయకుండా ఇప్పుడెలా వున్నావని అడుగుతున్నారా... ఇన్నాళ్లు ఎందుకు చేయలేదు ఫోను, నేను చేసినా పలకలేదు'' అప్పటికే గొంతు గాద్గదికం అయిపోయింది. అంతలోనే తమాయించుకుంది, తేరుకుంది.

'మొన్న మొన్నటిదాకా అతనెవరో, ఇదెవరో? ఇంతలోనే ఎంత దగ్గరితనం! ఆధిపత్యం కూడా చూపిస్తుంది... బాబోయ్ ఈ పెళ్లి ఎవరూ ఆపలేరు' మనసులో అనుకున్నది వర్ధనమ్మ.

''ఉద్యోగం విషయం... నాన్నగారు...మీకు చెప్పే...'' అతని మాటల్ని మధ్యలోనే ఆపేసింది ఇందిర.

''చెప్పేరు.. ఏ... అయితే'' అంటూ ఎదురు ప్రశ్నవేసింది

''మళ్లీ ఉద్యోగం వెతుక్కున్నాక పెళ్లి గురించి ఆలోచిస్తే బాగుంటుందేమో ఇందిర'' నొచ్చుకుంటూ అన్నాడు శ్రీనివాస్.

''అందుకు నాకేం అభ్యంతరం లేదు''.

''కానీ ఇలాంటిదే దొరక్కపోవచ్చు. ఇంత జీతం రాకపోవచ్చు. మరి నీకు ఇష్టమేనా'' అడిగేడు శ్రీనివాస్.

''అసలు రాకపోవచ్చు కూడాగా...'' కావాలనే ఉక్రోషంగా అన్నది ఇందిర.

''అదీ నిజమే... మరెలా'' బేలగా అడిగాడు.

''సాఫ్ట్‌వేర్, సాఫ్ట్‌వేరంటూ చచ్చిపోతున్నారు అందరూ. ఎన్నాళ్లయిందండీ ఈ సాఫ్ట్‌వేర్ పుట్టి. అంతకుముందు మనుషులు బ్రతకలేదా? ఉద్యోగాలు చేసుకోలేదా? సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయితే మనిషా? అదొక్కటే ఉద్యోగమా? మిగిలిన ప్రపంచం మాటేమిటి? కోటి విద్యలు కూటి కొరకే అన్నారు. పనిచేయాలని తపన, పనిచేసి సంపాదించాలని, సంపాదించిన దానితో సంసారం చేయాలని ఆసక్తి వుంటే చాలండి. లోకంలో ఎన్ని అవకాశాలు! బద్ధకం లేని వాడికి, బాధ్యత తెలిసిన వాడికి బ్రతకడానికి ఎన్ని మార్గాలో!''

''ఉన్న ఉద్యోగం పోవటం బాధాకరమే. కానీ అవే తలుచుకుంటూ కుమిలిపోవడం సమంజసం కాదంటాను. మరో ఉద్యోగం... ఏం ఏదో పని చేసుకుని బ్రతకలేమా? అసలు ప్రపంచంలో ఏ పని తక్కువది కాదు. ఎవరు చేసే పనిని వాళ్లు గౌరవించుకోవటం చేతకాక ఎవరికి వారే అవతలి వారు చాలా గౌరవప్రదమైన పని చేస్తున్నారు, నేను మాత్రం పనికి రాని పని చేస్తున్నానని తమకు తామే తక్కువ చేసుకుంటున్నారు గానీ సంఘంలో ప్రతిపనికీ విలువ వుంది. ఎవరు లేక పోయినా వ్యవస్థ స్తంభిస్తుంది. ఎవరి ప్రత్యేకత వారిదే. అందుకే ఏ పని చేసినా మనం ఆ పనికి గౌరవం కలిగించే విధంగా ఉండాలి. ఆ పని మూలంగా మనకి గౌరవం వచ్చేలా పని చేయాలి. అంతే''.

ఫోనులో నుంచి శ్రీనివాస్, ప్రత్యక్షంగా ఇందిర కుటుంబసభ్యులు ఆమె మాటల్ని శ్రద్ధగా ఆలకిస్తున్నారు. అంతక్రితమే ఆటో దిగివచ్చి పంచలో నిల్చున్న శ్రీనివాస్ తల్లిదండ్రుల రాక ఎవ్వరూ గమనించలేదు ఫోన్లో ఇందిరా, శ్రీనివాస్‌ల సంభాషణలో మమేకమైన కారణంగా.

''ఆఖరిగా ఒక్కమాట చెప్తున్నా వినండి. ఉద్యోగమే దొరకదని బెంగ పెట్టుకోకండి. ఏదో ఒకటి దొరుకుతుంది. మన ఇద్దరికీ దొరుకుతుంది. ఇద్దరం ఒకటే చదువు చదువుకున్నాం. ఒక వేళ దొరకదూ.... ఇంటి ముందు అట్లు పోసుకు బ్రతుకుదాం, కుట్లు అల్లికల్లో సంపాదిస్తా, పళ్లు అమ్ముకుని బ్రతుకుదాం, చెరకురసం అమ్మి ఆనందంగా జీవిస్తున్న భార్యాభర్తల్ని చూస్తున్నాం. శ్రమైక జీవన సౌందర్యం అనుభవిస్తూ ఆస్వాదిస్తూ కాపురాలు చక్కబెట్టుకుంటున్న వారు ఎంతమంది లేరూ అందర్లో మనం, అందర్తో మనం, ఏది ఉన్నా లేక పోయినా ధైర్యం ఒక్కటి మనతో వుంటే చాలు. అన్నీ వున్నట్లే. అందుకే మళ్లీ మళ్లీ ధైర్యంగా చెప్తున్నాను. నేను మిమ్మల్నే చేసుకుంటాను. ఓ గంట తర్వాత మళ్లీ నేనే మీకు ఫోన్ చేస్తాను.... ఉంటాను'' అని ఫోన్ కట్ చేసింది ఇందిర.

కూతురివైపు మెచ్చుకోలుగా చూస్తూ ఆమెకి దగ్గరగా వచ్చాడు నారాయణరావు.

''అవున్నాన్నా... వికలాంగులు, వితంతువులు, అనాధలు, అభాగ్యులు ఎందరో బ్రతుకుతున్నారు. ఇద్దరం ఉన్నత చదువులు చదువుకున్నాం. హాయిగా బ్రతకలేక పోతామా? బ్రతకలేమని భయ పడి పెళ్లిళ్లు మానేసి పిరికిగా ఎందుకు మారాలి'' ఆవేశంగా అన్నది ఇందిర.


''ఆడపిల్లకి పెళ్లి చేసేటప్పుడు అమ్మానాన్నలు అలా ఆలోచించడంలో తప్పు లేదు. కాని పెళ్లి కూతురు ఇంత హుందాగా ఆలోచించడం మాత్రం గొప్పేనమ్మా. ఈ కాలం ఆడపిల్లలందరికీ నీ పెళ్లి ఓ ఆదర్శం కావాలి. నీ మాటలు చాలామందికి హితం కావాలి'' అప్పుడే లోనికి వస్తూ అన్నాడు శ్రీనివాస్ తండ్రి.

సిగ్గుబిడియం కలగలపిన సంభ్రమంలో అందరి వంకా కృతజ్ఞతగా చూస్తుండి పోయింది ఇందిర.

ఆమె అభీష్టం మేరకు శ్రీనివాస్‌కు భార్య అయింది అందరి అంగీకారంతో, ఆశీర్వాదంతో.

మందార మకరంద మాధుర్యమున తేలు మధుపంబుజుననే...! అన్నట్టు ఇందిర, శ్రీనివాస్‌లు తమ జీవిత మకరందాన్ని ఒకరికి ఒకరు అందించుకుంటూ ఆస్వాదించుకుంటూ ఆనందంగా సంసారం సాగిస్తూ ఆనందమే జీవిత మకరందం అని మరోసారి నిరూపించారు.

★





చిరునామా:
పి.నాగేశ్వరరావు,
26-19-82, ఏ.టి. అగ్రహారం,
గుంటూరు – 522 004
ఫోన్: 94412 54044